- మద్దతుకంటే రూ.1200 అధికం
- గతంలో ఎన్నడూ లేని విధంగా రేటు
- బాదేపల్లి మార్కెట్‌ను ముంచెత్తిన బస్తాలు
- రోజురోజుకూ పెరుగుతున్న ధరలు
- ధర పెరగడంతో రైతన్నల సంతోషం



బాదేపల్లి మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన ధాన్యం

# సన్నధాన్యం.. రూ.3,545

### వారం రోజులుగా ధాన్యం ధరలు..

| తేదీ | గరిష్ఠం | కనిష్ఠం | మధ్యస్తం |
|---|---|---|---|
| 5 | 3,251 | 1,821 | 3,156 |
| 6 | 3,219 | 1,219 | 2,920 |
| 8 | 3,319 | 1,759 | 3,061 |
| 9 | 3,356 | 1,769 | 3,256 |
| 11 | 3,389 | 1,725 | 3,200 |
| 13 | 3,454 | 2,139 | 3,286 |
| 14 | 3,545 | 2,060 | 3,391 |

జడ్చర్ల, డిసెంబర్ 14 : ఇదివరకెన్నడూ లేనివిధంగా వరికి రికార్డు స్థాయిలో ధర పలుకుతున్నది. మొదటగా క్వింటాకు రూ.1,800 నుంచి ప్రారంభమైన ధర రోజురోజుకు పెరుగుతూ ప్రస్తుతం రూ.3,545లకు చేరుకున్నది. దీంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌ఎన్‌ఆర్ సన్నరకం ధాన్యానికి రికార్డు స్థాయిలో ధర వస్తున్నది. రాష్ట్ర మార్కెట్ చరిత్రలోనే ఎన్నడూ లేనంతగా ధరలు పలుకుతుండటం, రైతులు మార్కెట్‌కు క్యూకట్టారు. దాంతో మార్కెట్‌కు ధాన్యం పెద్దఎత్తున అమ్మకానికి వస్తున్నది. గత సీజన్‌లో క్వింటా రూ.2,600లకు పైగా ధరలు పలుకగా, ఈ వానకాలం సీజన్‌లో రికార్డు స్థాయికి చేరుకున్నది. మరింత ధరలు పెరిగే అవకాశం కూడా లేకపోలేదు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.2,203 ఉండగా, మార్కెట్‌లో క్వింటా రూ.3,545వరకు ధర పలుకుతున్నది. కనిష్ఠంగా రూ.2,060, మధ్యస్తంగా రూ.3,391 ధర పలికింది. ఆర్‌ఎన్‌ఆర్ సన్నరకాలకు డిమాండ్ ఎక్కువగా ఉండడంతో వ్యాపారులు ధరలను పెంచి కొనుగోలు చేస్తున్నారు. ఆర్‌ఎన్‌ఆర్(తెలంగాణ సోన) ఈరకం బియ్యం సన్నగా ఉండటం, క్వాలిటీ బాగా ఉండటం, నూనెశాతం తక్కువ, షుగర్ పేషంట్లలకు బాగుంటుందని డిమాండ్ పెరిగింది. అదేవిధంగా గతంలో వేసే బీపీటీ(సోనరకం) ధాన్యాన్ని రైతులు అంతగా సాగుచేయకపోవడం కూడా ఈ సన్నాలకు డిమాండ్ అధికంగా వస్తున్నది. రాష్ట్రంలోని హైదరాబాద్, మిర్యాలగూడతో పాటు ఇతర రాష్ట్రాలకు ఆంధ్రాలోని మండపేట, కర్ణాటకలోని రాయిపూర్, తదితర ప్రాంతాలకు సన్నరకం ధాన్యం ఎగుమతి అవుతుండటం కూడా సన్నాలకు మంచి ధరలు వస్తున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సన్నాలను సాగుచేయాలని రైతులకు సూచించడం జరిగింది. దాంతోఅప్పటి నుంచి రైతులు అధికంగా సన్నరకాలను సాగుచేస్తున్నారు. అయితే యాసంగిలో ఎక్కువశాతం 1010 దొడ్డురకం ధాన్యం సాగుచేసే అవకాశం ఎక్కువగా ఉండటంతో వచ్చే సీజన్‌ను కూడా దృష్టిలో ఉంచుకొని వ్యాపారులు సన్నరకాలకు ధరలు అధికంగా వేసి కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది వానాకాలంలో లక్షా 90వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. గతేడాది వానాకాలంలో లక్షా 80వేల ఎకరాల్లో సాగుచేశారు. ఎకరాకు దాదాపుగా 40 నుంచి 45బస్తాల దిగుబడి వస్తున్నది. జిల్లాలో దాదాపు 3లక్షల 90వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానున్నది.



బాదేపల్లిలో ధాన్యాన్ని లోడ్ చేస్తున్న హమాలీలు

**మార్కెట్ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా..**

బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యానికి అత్యధిక ధరలు పలుకుతున్నాయి. మార్కెట్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆర్‌ఎన్‌ఆర్‌కు అధిక ధరలు వస్తున్నాయి. ఇప్పటి వరకు ఇదే అత్యధికం.

### ధాన్యం నాణ్యతను బట్టి ధరలు..

ఆర్‌ఎన్‌ఆర్‌కు రాష్ట్రంలోనే బాదేపల్లి మార్కెట్‌లో అధిక ధరలు వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఆర్‌ఎన్‌ఆర్ రకం ఎక్కువగా సాగవుతున్నది. నాన్ డయాబెటిక్, సన్నగా ఉండటం, బీపీటీ(సోన)లేకపోవడంతో తెలంగాణ సోనకు డిమాండ్ పెరిగింది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మండపేట, మిర్యాలగూడ తదితర ప్రాంతాలకు ఇక్కడి ధాన్యం ఎక్కువగా ఎగుమతి అవుతున్నది. దీంతో మార్కెట్‌లో సన్నరకాలకు ధరలు బాగా వస్తున్నాయి.

**– అలంపల్లి మనోహర్, వ్యాపారి, జడ్చర్ల**

### పోటాపోటీగా ధరలు పెరుగుతున్నయ్..

రైతులు ధాన్యాన్ని బాగా ఆరబెట్టి, చెత్తాచెదారం లేకుండా నాణ్యతగా తీసుకొస్తే అధిక ధరకు అమ్ముకోవచ్చు. సన్నరకాల వడ్లకు మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో వ్యాపారులు పోటీపడి ధరలు పెంచేస్తున్నారు. రైతులకు లాభం కలుగుతున్నది. ఆంధ్రాలో తుఫాను ప్రభావం వల్ల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో ధాన్యం ధరలు పెరుగుతున్నాయి. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉంది.

**– శ్రీనివాస్, బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి**

### ఇంత ధర వస్తదనుకోలే..



సన్న రకాలకు ఇంత ధర వస్తుందని అనుకోలేదు. మూడున్నర ఎకరాల్లో ఆర్‌ఎన్‌ఆర్ సన్నరకం ధాన్యం సాగుచేశా. దాదాపు 120 బస్తాలకు పైగా ధాన్యం పండింది. నేను తీసుకొచ్చిన ధాన్యానికి క్వింటా రూ.3,340ధర వచ్చింది. ఈ సారి వరిచేనుకు ఎలాంటి తెగుళ్లు లేకపోవడంతో మంచి దిగుబడి వచ్చింది. వర్షాలు లేకున్నా గత ప్రభుత్వం 24గంటల కరెంటు ఇవ్వడంతో పంటలు మంచిగ పండినయి.

**–వెంకటయ్య, కొండేడు, జడ్చర్ల మండలం**

### సాగు ఖర్చులు పోనూ లాభమే..



ధాన్యానికి ఇంత పెద్ద మొత్తంలో ధరలు ఉంటే రైతులు బాగుపడుతారు. సాగు ఖర్చులు పోను లాభం వస్తున్నది. నేను చూసిన కాలంలో ఎన్నడూ ఇంతటి ధర రాలేదు. నేను తీసుకొచ్చిన ధాన్యానికి రూ.3,230 ధర రావడం ఆనందంగా ఉంది. వ్యవసాయంపై ఆధారపడే రైతులకు గిట్టుబాటయ్యే ధరలు వచ్చేలా చూడాలి. గత ప్రభుత్వం సాగునీరు, కరెంటు ఇవ్వడంతో సాగు మంచిగైంది.

**– శంకరయ్య, కాకునూరు, కేశంపేట మండలం**

- ఉమ్మడి జిల్లాలో బియ్యం ధరలకు రెక్కలు
- వారంలోనే క్వింటాకు రూ.800 పెరుగుదల
- రూ.6,400 మార్క్‌కు చేరిన పాత బియ్యం
- హంస రకానికి అదే దారి..
- ఆందోళనలో పేద, మధ్య తరగతివాసులు

# ధర దడ



కల్వకుర్తి, డిసెంబర్ 14 రోజురోజుకు సన్న బియ్యం ధరలు పెరుగుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల్లోనే క్వింటా సన్న బియ్యం ధర రూ.800 వరకు పెరిగింది. ప్రస్తుత మార్కెట్‌లో సన్నబియ్యం సోనమసూరి, బీపీటీ, ఆర్‌ఎన్‌ఆర్ రకాలకు చెందిన పాత య్యం రూ.6,400 వరకు ధర పలుకుతుండగా, కొత్త బియ్యం క్వింటా రూ.5,400 వరకు ధర చేరింది. గతేడాది నవంబర్, డిసెంబర్‌లో రూ.4,400 నుంచి రూ.4,800 ధర ఉన్న పాత బియ్యం, ప్రస్తుతం రూ.1200లకు పెరిగింది. హంస బియ్యం ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. పాత హంస బియ్యం ధర దాదాపు రూ.4వేల వరకు ఉంది.

**సన్నవడ్ల ధర పెరగడంతో..**

సన్న వడ్ల ధర పెరగడంతో కొందరు రైతులు తాము పండించిన సన్న వడ్లను నేరుగా మిల్లుకు తరలించి బియ్యంగా మార్చుకుంటున్నారు. బియ్యం ధర అధికంగా పెరుగుతుండటంతో సదరు బియ్యాన్ని తర్వాత నేరుగా విక్రయించుకుంటే మరింత లాభం వస్తుందని రైతులు భావిస్తున్నారు. పెట్టుబడి ఖర్చుల నిమిత్తం తాము పండించిన సన్న వడ్లను కొంత భాగం అమ్ముకొని, మరికొంత భాగాన్ని బియ్యంగా మార్చుకుంటున్నారు. బియ్యం రెండు మూడు నెలలు ఉంచితే పాతగా మారుతాయి. అదనంగా క్వింటాకు రూ.వెయ్యి వరకు మిగులుతాయని రైతుల అంటున్నారు.ధరల పెరుగుదలకు రెండు కారణాలున్నాయని బియ్యం వ్యాపారులు చెబుతున్నారు. బియ్యాన్ని బయటి రాష్ట్రాలకు ఎగుమతి చేయడం, రెండోవది మిగ్‌జాం తుఫాను దాటికి తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో వరి దెబ్బతినడమని వ్యాపారులు అంటున్నారు.

### అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరిగాయి..

అంతర్జాతీయ మార్కెట్‌లోనే బియ్యం ధరలు పెరుగుతున్నాయి. బియ్యం ఎక్కువగా ఉపయోగించే దేశాల్లో కరువు తదితర పరిస్థితుల వల్ల ఎక్కువ డిమాండ్ ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం బియ్యం ఎగుమతులకు 20శాతం పన్ను విధిస్తున్నా ఎగుమతులు ఆడగం లేదు. దీనికి తోడు మిగ్‌జాం తుపాన్ ప్రభావం వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో వరి దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. దీంతో బియ్యం ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి.

**– జూలూరి రమేశ్‌బాబు, రైస్‌మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు**

# ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

- విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి
- కలెక్టర్ ఉదయ్‌కుమార్
- ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల అండర్-14,17 జోనల్‌స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

అచ్చంపేట, డిసెంబర్ 14 : ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థుల అండర్-14, అండర్-17 జోనల్ స్థాయి క్రీడా పోటీలను అచ్చంపేట పట్టణంలోని ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా నాగర్‌కర్నూల్ కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ హాజరై క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడా పతాకా విష్కరణ, జ్యోతి ప్రజ్వలన చేశారు. అంతకుముందు నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి, మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల నుంచి వచ్చిన 1,657 మంది గురుకుల క్రీడాకారులు అధికారులకు, మార్చ్ ఫాస్ట్ చేసి అధికారులతో గౌరవ వందనం స్వీకరించారు. అంతకుముందు విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో ఆడిన వారే భవిష్యత్‌లో రాణిస్తారని అన్నారు. అచ్చంపేట మూడోసారి జోనల్ క్రీడలకు అతిథ్యమిస్తున్నదని, అందుకు కృషిచేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులను ఆయన అభినందించారు. ప్రపంచంతో పోటీపడేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ఉపాధ్యాయులు చదువుతోపాటు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలని చెప్పారు. ఏడు జిల్లాల నుంచి వచ్చిన బాలబాలికలు ఆత్మవిశ్వాసంతో ఆడి విజయం సాధించాలన్నారు. కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని, ఒకప్పుడు తాను కూడా ప్రభుత్వ పాఠశాల విద్యార్థినేనని తెలిపారు. గ్రామీణ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను బయటకు తీసేందుకు జోనల్ స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రింగ్‌బాల్, అథ్లెటిక్, ఇండోర్, భాస్కెట్‌బాల్ పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రతి విద్యార్థి జోనల్, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. అండర్-14, 17 విభాగంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, క్యారమ్స్, చెస్, లాంగ్‌జంప్, హైజంప్, హ్యాండ్‌బాల్‌తోపాటు అథ్లెటిక్ పోటీలు మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు గిరిజన సంక్షేమశాఖ అధికారి కమలాకర్‌రెడ్డి తెలిపారు. జోనల్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు భద్రాచలంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ నర్సింహ్మగౌడ్, ఆర్డీవో గోపిరామ్, నల్లగొండ, సూర్యాపేట, డీటీడబ్ల్యూవోలు రాజ్‌కుమార్, శంకర్, ఏటీడబ్ల్యూవో లక్ష్మారెడ్డి, బాలకృష్ణ, ఎంఈవో రామారావు, సీఐ అనుదీప్, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలు, ఏటీడబ్ల్యూవోలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కృష్ణజింకలతో రైతన్న కుదేలు

పర్యాటకులను కనువిందు చేసే కృష్ణ జింకలు రైతుల పాలిట మాత్రం శాపంగా మారాయి. నారాయణపేట జిల్లా మక్తల్, మాగనూరు, కృష్ణా మండలాల్లో కృష్ణ జింకల బెడద తీవ్ర స్థాయిలో ఉన్నది. జింకల సంతతి భారీ స్థాయిలో పెరిగిపోవడం, నదీ తీర ప్రాంతం కావడంతో ఒక్కో గుంపులో వంద నుంచి 150 జింకలు వచ్చి పంట పొలాలపై దాడి చేస్తున్నాయి. దీంతో రైతన్నలు బెంబేలెత్తుతున్నారు. కంటిమీద కునుకులేకుండా రాత్రింబవళ్లు పొలాలగట్లపై నిద్ర కాస్తూ పంటలను కాపాడుకుంటున్నారు. వాటి బారి నుంచి పంటలను కాపాడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతన్నలు వేడుకుంటున్నారు.

**- మహబూబ్‌నగర్ ఫొటోగ్రాఫర్, డిసెంబర్ 14**





మక్తల్ మండలంలో సంచరిస్తున్న కృష్ణజింకలు



ఆర్డీఎస్ ప్రధానకాల్వలో పారుతున్న నీరు

# ఆర్డీఎస్‌కు స్వల్పంగా ఇన్‌ఫ్లో

అయిజ, డిసెంబర్ 14 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద స్వల్పంగా కొనసాగుతోంది. గురువారం 198 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరగా, ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 396 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 7.5 అడుగుల మేర నీటి మట్టం ఉన్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు. తుమ్మిళ్ల పథకం పంప్ ద్వారా నీటి విడుదల కొనసాగుతుందని పేర్కొన్నారు.

**టీబీ డ్యాంకు..**

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో స్వల్పంగా కొనసాగుతోంది. గురువారం 370 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్‌ఫ్లో 976 క్యూసెక్కులుగా ఉన్నది. 105.788 టీఎంసీల పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 11.885 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 1,633 అడుగుల గరిష్ఠ నీటిమట్టానికి గానూ ప్రస్తుతం 1591.00 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘువేంద్ర తెలిపారు.



- కొల్లాపూర్ పరిసరాల్లో బెబ్బులి కలకలం
- భయం గుప్పిట్లో మత్స్యకారులు, స్థానికులు
- అప్రమత్తమైన అటవీ శాఖాధికారులు

# వామ్మో పులి

కొల్లాపూర్ రూరల్, డిసెంబరు 14 : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో దట్టమైన నల్లమల అభయఅరణ్యాన్ని చీల్చుకుంటూ కృష్ణానది ప్రవహిస్తున్నది. ఇక్కడ గతంలో కంటే పులుల సంఖ్య పెరిగినట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు చీమలు దూరని చిట్టడవీలోకి అక్రమ కలప రవాణా చేయడంతో జంతువులు వలసబాట పట్టాయి. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఫారెస్ట్ అధికారులు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి కలప స్మగర్లపై పీడీ యాక్ట్ నమోదు చేయడంతో పూర్తిగా అక్రమ కలప రవాణాకు అడ్డుకట్టపడింది. దీంతో కొల్లాపూర్ ఫా రెస్ట్ రెయింజ్ పరిధిలో 36,872 హెక్టర్లలో దట్టమైన అభయారణ్యం విస్తరించింది. కెమెరాల్లో రికార్డు అయిన పులుల సంఖ్య 13 వరకు ఉందని, డీప్ ఫారెస్ట్‌లో పులుల సంఖ్య అధికంగా ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మైదాన ప్రాంతాలకు సరిహద్దులో అడవి జంతువులు మైదాన ప్రాంతంలోకి రాకుండా చుట్టూ కందకాలను తీశారు. కొల్లాపూర్ రేంజ్ పరిధిలోని అంకిల్‌పెంట, పెద్దూటి, జాలిపెంట, ఎర్రపెంట, ఎన్మామానుపెంట పెంట, ఎర్రగూడెం పెంట, రేలాపాడు ఏరియాల్లో నల్లమలలోకి ప్రవేశించేందుకు ఫారెస్ట్ అధికారులకు కూడా కష్టసాధ్యమైన పని. కానీ సాధ్యమైన వరకు నీటి తొట్లను, కెమెరాలను ఏర్పాటు చేశారు. శాఖాహార జంతువుల కోసం కొన్ని చోట్ల ప్రత్యేకమైన సీడ్‌తో గడ్డి పెంచారు. ఫారెస్ట్ అధికారులు ఎన్ని ఏర్పాట్లు చేయగా, జంతువుల సంఖ్య పెరిగి అటవిని దాటి బయటకు వచ్చేందుకు జంతువులు ప్రయత్నం చేస్తున్నాయి.

నల్లమల అభయారణ్యానికి ఆనుకొని కృష్ణానది ప్రవాహిస్తుండడంతో తాగునీటి కోసం జంతువులు ఒడ్డుకు చేరుకుంటున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలోని ఫారెస్ట్ మైదాన ప్రాంతాలకు అతి సమీపంలో ఉండడంతో పాటు నల్లమలకు నివాస గ్రామాలు ఉండడం, వాటికి ఆహారం సరిగా లభించకపోవడంతో కొన్ని పులులు కొల్లాపూర్ ఫారెస్ రేంజ్ పరిధిలోకి వస్తున్నాయి. ఇటీవల మంగళవారం అమరగిరి చెంచుగూడెం సమీపంలో కనిపించిన పెద్దపులి కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. నల్లమలకు ఆనుకొని కృష్ణానది ఒడ్డున చేపల వేట సాగించే జాలర్లు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. రాత్రి సమయాల్లో జంతువుల బారి నుంచి తప్పించుకునేందుకు నదీతీరం వెంట మంటలు పెడుతుండడంతో జంతువులు నీటి దాహాన్ని తీర్చుకునేందుకు పగటిపూట నది ప్రవాహం వద్దకు వస్తున్నాయి. దాహార్తి కోసం వచ్చే పులులు ఎక్కడ తమపై దాడి చేస్తాయననే భయంతో జాలర్లు, చెంచులు, సమీప గ్రామాల పశువుల కాపరులు, రైతులు భయందోళనలో ఉన్నారు.

### సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..



కొల్లాపూర్ నల్లమల పరిసర ప్రాంతాల్లో పులుల కదిలికలు ఉన్నాయి. పులుల సంఖ్య కూడా పెరిగింది. సమీప గ్రా మాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అనుమతులు లేకుం డా ఎవరూ అడవిలో కి ప్రవేశించకూడదు. కొల్లాపూర్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం.

**-శరత్‌చంద్రారెడ్డి, ఫారెస్ట్ రేంజ్ అధికారి, కొల్లాపూర్**